సింహగిరి ప్రదక్షిణకు సన్నద్ధం

సింహగిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామి ప్రధాన ఉత్సవాల్లో ఒకటైన గిరి ప్రదక్షిణ జూలై 2న జరగనుంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని సీతమ్మధార నుంచి ఆర్ అండ్ బీ జంక్షన్ మారియట్ హోటల్ వరకు భక్తులు నడిచే గిరి ప్రదక్షిణ మార్గాన్ని ఆధునికీకరిస్తున్నారు. సుమారు రూ.9 కోట్లతో చేపడుతున్న ఈ పనులను ఇటీవల ప్రారంభించి వేగవంతంగా పూర్తిచేస్తున్నారు.

- చకచకా రహదారి విస్తరణ పనులు
- భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు


51వ వార్డు కళింగనగర్‌లో సిద్ధమవుతున్న గిరి ప్రదక్షిణ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మద్దిపాలెం: జీవీఎంసీ 50, 51 వార్డుల్లో గిరి ప్రదక్షిణ రహదారి విస్తరణ, పునర్నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రస్తుతానికి 50వ వార్డులో తాత్కాలికంగా రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ మార్గం ద్వారా భక్తులు నడిచి వెళ్లేందుకు వీలుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా, వారి సౌకర్యం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ పూర్తయ్యాక రెండు నెలల్లో మరింత సుందరంగా రోడ్డును అభివృద్ధి చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నారు. 51వ వార్డులో మాధవధార 48 బస్‌స్టాప్ నుంచి కళింగనగర్ పైకి మాధవ స్వామి ఆలయం వైపు వెళ్లే రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మిస్తున్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం సింహాద్రి అప్పన్న భక్తులు గిరి ప్రదక్షిణ రోజున ఈ దారి నుంచే వెళ్తుంటారు. వేలాది మంది భక్తులు దాదాపు 32 కిలో మీటర్ల మేర గిరి ప్రదక్షిణ చేస్తూ ఈ మార్గం ద్వారా వెళ్లి స్వామిని దర్శించుకుంటారు.

నిరంతర పరిశీలన.. పర్యవేక్షణ

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ప్రజా శ్రేయస్సుకు పెద్దపీట వేసిన విషయం తెలిసిందే. ఇటీవల మేయర్ గొలగాని హరివెంకటకుమారి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజుతో కలిసి 45, 46, 48, 49, 50, 51 వార్డుల పరిధిలోని గిరి ప్రదక్షిణ రోడ్డు పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ, 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.9 కోట్లతో ఈ పనులకు శ్రీకారం చుట్టి ప్రారంభించారు. రోడ్డు విస్తరణ పనులు మొదలై వాటర్ వర్క్ జరుగుతోంది. అధికారులు ఎప్పటికప్పుడు వీటిని పరిశీలిస్తున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇటీవల తన పర్యటనలో గిరి ప్రదక్షిణ రహదారి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఎప్పటికప్పుడు ఈ పనులను పరిశీలిస్తూ అధికారులతో మాట్లాడుతున్నారు. ఆయా వార్డుల కార్పొరేటర్లు కూడా విస్తరణ పనులను పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలిస్తున్నారు. జూలై 2న సింహాచలం గిరి ప్రదక్షిణ కావడంతో తాత్కాలికంగా పనులు మొదలు పెట్టి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు.


వర్మ కాంప్లెక్స్ సమీపంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు


50వ వార్డు మురళీనగర్‌లో పనులు చేస్తున్న కార్మికులు

కాలినడకన ఇబ్బంది లేకుండా..



సింహాచలం గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు కాలిబాటలో ఇబ్బంది కలుగకుండా తాత్కాలికంగా రోడ్డు పనులు మొదలు పెట్టాం. ఇవి పూర్తి స్థాయిలో అవ్వడానికి కనీసం రెండు నెలలు పడుతుంది. సమయం తక్కువగా ఉండటం వల్ల భక్తులకు ఇబ్బందులు కలుగకుండా రహదారి విస్తరణ పనులు చేయిస్తున్నాం.

– వావిలపల్లి ప్రసాద్, కార్పొరేటర్, 50వ వార్డు

పూర్తి స్థాయిలోనే నిర్మాణం



48 బస్‌స్టాప్ 51వ వార్డు మొదలు పైకి కళింగనగర్ మీదుగా లేన్సమ్ గ్రీన్స్ నుంచి మాధవధార వెళ్లే మార్గంలో రోడ్డును పూర్తి స్థాయిలోనే నిర్మిస్తున్నాం. గిరి ప్రదక్షిణ చేసే భక్తులు ఈ మార్గంలోనే పైకి వచ్చి మాధవ స్వామిని దర్శించుకుని మాధవధార మెయిన్‌రోడ్డు వైపు కిందకు దిగి ముందుకు సాగుతుంటారు.

– రెయ్యి వెంకటరమణ, కార్పొరేటర్, 51వ వార్డు

జేసీఎస్ మండల ఇన్‌చార్జుల నియామకం

సీతంపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జులను నియమించారు. ఉత్తర నియోజకవర్గంలోని 17 వార్డులకు సంబంధించి ఐదుగురిని ఎంపిక చేశారు. 14, 24, 25 వార్డులకు కర్రి మురళీకృష్ణ.. 26, 42, 43, 44 వార్డులకు బులుసు జగదీష్.. 45, 46, 47, 48 వార్డులకు కొల్లాబత్తుల వెంగళరావు.. 49, 50, 51 వార్డులకు నీలి రవి.. 53, 54, 55 వార్డులకు గుంటు అమరేశ్వర రెడ్డి జేసీఎస్ మండల ఇన్‌చార్జిలుగా నియామకమయ్యారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

పాపా హోం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలతో పాపా హోం విద్యార్థులు

అల్లిపురం: పోలీస్ బ్యారెక్స్‌లోని పాపా హోంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ సహకారంతో పుస్తకాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ 31వ వార్డు అధ్యక్షుడు బత్తిన నాగరాజు, ఇన్‌చార్జి బత్తిన నవీన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలతోపాటు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు శంకరరావు, త్రిమూర్తులు, రాజేష్, జితేంద్ర, లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాయినాథుడికి పూజలు, అభిషేకాలు


నార్త్ ఎక్స్‌టెన్షన్ బాబా ఆలయంలో భక్తులు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజా స్వామి ఆధ్వర్యంలో ఉదయం బాబాకు పంచామృతాభిషేకం, భక్తుల నామగోత్రాలతో పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శివ, వనజాక్షి పాల్గొన్నారు.

కొండవాలులో ఎల్‌ఈడీ వెలుగులు


జైభారత్‌నగర్‌లో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో కొత్తగా ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. వీధి దీపాలు లేని విద్యుత్ స్తంభాలను, పాడైన లైట్లను గుర్తించిన కార్పొరేటర్ గంకల కవిత జీవీఎంసీ ఎలక్ట్రికల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు గురువారం బాపూజీనగర్, శ్రీనివాస్ నగర్, ఇందిరానగర్, ఏఎస్‌ఆర్ నగర్, మహాత్మా గాంధీ నగర్, జైభారత్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు సిబ్బంది ఎల్‌ఈడీ లైట్లు అమర్చారు. ఈ పనులను బీజేపీ వార్డు సీనియర్ నాయకుడు గంకల అప్పారావు పర్యవేక్షించారు. కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు ప్రసరించడంతో నివాసులు హర్షం వ్యక్తం చేశారు. వార్డులోని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని స్థానికులను కార్పొరేటర్ కవిత కోరారు.

బాబా మందిరానికి మరమ్మతులు


మందిరంలో మరమ్మతులు చేస్తున్న కార్మికులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలోని సాయిబాబా మందిరంలో మరమ్మతులు జరుగుతున్నాయి. బాబా భక్తుడు దాడి చిన్నబాబు తన సొంత నిధులతో టైల్స్, గచ్చులు, స్టీల్ గ్రిల్స్ తయారు చేయిస్తున్నారు. దీంతో సాయి మందిర రూపురేఖలు మారనున్నాయి.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎం.ధనలత, సతీష్, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. రూ.500 రుసుం చెల్లిస్తే ఇద్దరు భక్తులను పూజకు అనుమతించనున్నారు. వివరాలకు 0891 2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలి.

భక్తిశ్రద్ధలతో బక్రీద్


జాకీర్ హుస్సేన్‌నగర్ మసీదు వద్ద బక్రీద్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ముస్లిం తాటిచెట్లపాలెం మసీద్ ఈ క్యూబాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్దిపాలెం మస్జిద్-ఈ-అల్ పతా, జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్-ఈ-అల్ ఖదీర్ ఆధ్వర్యంలో గురువారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాకీర్ హుస్సేన్ నగర్ మసీదు వద్ద ముస్లింలు వేకువజాము నుంచి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఖురాన్ పఠించారు. పరిసర ప్రాంతాల్లో శాంతి ర్యాలీ నిర్వహించి సమీప ఈద్గా స్థలం వద్దకు చేరుకుని ఈద్-ఉల్-అదా నమాజ్ ఆచరించారు. హిమామ్(ముస్లిం గురువు) తక్రీర్ పఠించి ఖురాన్‌లో సూక్తులను వివరించారు. అనంతరం ముస్లింలు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సమీపంలోని కబ్రస్థాన్(ముస్లిం శ్మశానవాటిక) వద్దకు వెళ్లి పూర్వీకుల సమాధుల వద్ద పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షులు మున్నా, గౌస్, వలి, నూరి, బాషా తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక

సీతంపేట: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండగను ముస్లిం తాటిచెట్లపాలెం, చిన్నూరు మసీదు, ఈద్గాల్లో ఘనంగా నిర్వహించారు. 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని మసీద్ ఈ క్యూబాలో కమిటీ ఆధ్వర్యంలో బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 8 గంటల నుంచే ముస్లింలు పెద్ద సంఖ్యలో ఈ క్యూబా మసీదు, ఈద్గాల్లో ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేకున్నారు. ఈ సందర్భంగా ఈదుల్ అజహా ప్రత్యేక నమాజ్ ఆచరించారు. మసీద్ హాఫీజ్ ముస్తేజాబ్ తురుక్ ఆధ్వర్యంలో జరిగిన ఈద్ నమాజ్‌లో పెద్ద సంఖ్యలో ముస్లిం యువత సంప్రదాయ వస్త్రధారణలో సందడి చేశారు.

ఎన్‌ఏడీ సీఈ ఎంప్లాయీస్ ఎన్నికల పోరు షురూ

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపోలో ఎన్నికల సందడి మొదలైంది. ఎన్ఏడీ సివిల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ పాలక మండలి కాల పరిమితి పూర్తి కావడంతో ఎన్నికల నగారా మోగింది. దీంతో ఎన్ఏడీ సీఈ యూనియన్, ఎన్ఏడబ్ల్యూ అండ్ ఎస్ యూనియన్ తలపడుతున్నాయి. అందులో ఎన్ఏడీ సీఈ యూనియన్ తన ప్యానల్‌ను ముందుగా ప్రకటించింది. కె. సూరి రెడ్డి, జి. ముత్యరాజు, టి. సంతోష్ కుమార్, వీటీఆర్ శ్రీను, కె. నారాయణరావు, డి. శివ, వి. సంతోష్‌కుమార్, కె. సూర్యనారాయణ పోటీలో ఉన్నారని సీఈ యూనియన్ నాయకులు చెబుతున్నారు. తమ సభ్యులను ఎన్నుకుంటే సొసైటీ సభ్యులకు 9 శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇస్తున్నారు. సభ్యుల పిల్లలకు ఇన్సూరెన్స్, సొసైటీ సభ్యులకు ఇంటి స్థలం అందిస్తామంటూ హామీలతో ముందుకెళ్తున్నారు. ఈ ఎన్నికల్లో తమ ప్యానల్‌ను గెలిపించాలని కోరుతున్నారు.

వెంకన్న ఆలయాల్లో ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో సంపత్ వేంకటేశ్వర స్వామి, కలియుగ వెంకన్న సన్నిధిలో అర్చకులు, భక్తులు

కంచరపాలెం: ఆషాఢ మాస శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా గురువారం గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో వెంకన్నకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, పద్మావతి, అలమేలు మంగమ్మలకు విశేష పూజలు జరిపారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం నక్షత్ర హారతి, భక్తి సంకీర్తన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జర్నలిస్టు తులసి చందుకు రక్షణ కల్పించండి


నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

సీతంపేట: జర్నలిస్టు తులసి చందుకు డెత్ వార్నింగ్ పంపిన మతోన్మాదులను, భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పులకు తెగబడిన ముష్కరులను తక్షణమే అరెస్టు చేయాలంటూ విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక గురువారం రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో నిరసన చేపట్టింది. సంఘ రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అండతోనే దేశం నలుమూలలా మనువాదులు రెచ్చిపోతున్నారన్నారు. తులసి చందును చంపుతామనడం, చంద్రశేఖర్‌పై నేరుగా కాల్పులు చూస్తుంటే ఇది ప్రజాస్వామ్యమా లేక తుపాకీ రాజ్యమా అని అనుమానం కలుగుతోందన్నారు. తులసి చందుకు రక్షణ కల్పించాలంటూ తెలంగాణ సీఎం కేసీఆర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీజీపీ, సీఎస్‌లకు రాసిన లేఖలను ఆయన విడుదల చేశారు. పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

చెట్టు కొమ్మలు తరలించండి


లలితానగర్ రోడ్‌లో వదిలేసిన చెట్టు కొమ్మలు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు శంకరమఠం నుంచి అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌కు వెళ్లే 'సాక్షి' రహదారిలో వారం కిందట భారీ చెట్టు కూలిపోయింది. దానిని ముక్కలుగా నరికి తరలించారు. కొమ్మలను మాత్రం పోగులుగా వేసి తరలించకుండా అక్కడే వదిలి పెట్టేసారు. ఈ మార్గంలో పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. చెట్ల కొమ్మలు, పైప్‌లైన్ పనులతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి చెట్టు కొమ్మలు తరలించేలా చర్యలు చేపట్టాలి.

– జి.నారాయణరావు, లలితానగర్

దుకాణాలతో ట్రాఫిక్ సమస్యలు


లలిత గుడి రోడ్డులో ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాలు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లోని శ్యామలాంబ గుడి నుంచి లలిత ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా పూజా సామగ్రి విక్రయించే దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో సగం రహదారి ఆక్రమణకు గురైంది. ఆ మార్గంలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే వీలు లేక తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. సాయంత్రం వేళల్లో ఈ రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది, ఆ సమయంలో దుకాణాల వల్ల రోడ్డు కుచించుకుపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– కె.ఆర్.కె.గుప్తా, లలితానగర్

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మద్దిపాలెం: జోన్-2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధి 11 కేవీ మాధవధార-1, 2, తెన్నేటినగర్, కళింగనగర్, సీతన్న గార్డెన్స్, లేన్సమ్ గ్రీన్స్ ఫీడర్ల నిర్వహణ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మాధవధార వుడా కాలనీ, కనకమహాలక్ష్మి టెంపుల్ రోడ్డు, శ్రీశాంతి ల్యాండ్‌మార్క్ ఏరియా, విజేత మార్ట్ ఏరియా, మాధవధార, అంబేడ్కర్ కాలనీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏరియా, కనకదుర్గా ఫంక్షన్ హాల్ జంక్షన్, మాధవధార గాయత్రి విద్యామందిర్ రోడ్డు, జనతా గ్యారేజ్ జంక్షన్, గ్యాస్ గొడౌన్ జంక్షన్, మాధవ స్వామి టెంపుల్ రోడ్డు, కళింగనగర్ ఎంఎన్ఆర్ పార్కు, సాయిరాం పార్లర్ జంక్షన్ నుంచి వాటర్ ట్యాంక్ రోడ్డు, లేన్సమ్ గ్రీన్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

మద్దిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: మద్దిపాలెం సెక్షన్ పరిధిలోని ఈపీఎఫ్, మద్దిపాలెం వుడా లేఅవుట్ 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, గ్రీన్ గార్డెన్స్ 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మద్దిపాలెం వుడా లేఅవుట్, శివ శివానీ పాఠశాల, పోలీస్ క్వార్టర్స్, ఈపీఎఫ్ క్వార్టర్స్, లీడర్ ప్రెస్ ఏరియా, భాస్కర్ గార్డెన్స్, శివనగర్, ఎఫ్‌సీఐ కాలనీ, మద్దిపాలెం మెయిన్ రోడ్, గవర వీధి, గొల్ల వీధి, రాణాప్రతాప్ నగర్, శ్రీనివాస్‌నగర్, హుస్సేన్‌నగర్, రైల్వే క్వార్టర్స్, నరేంద్రనగర్, పార్వతీనగర్, పంజాబ్ హోటల్ జంక్షన్, శాంతినగర్ జర్నలిస్టు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

అక్కయ్యపాలెం సెక్షన్‌లో రేపు..

తాటిచెట్లపాలెం: ఏపీఈపీడీసీఎల్ అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో జూలై 1న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్-1 ఆపరేషన్ ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బీఎండబ్ల్యూ షోరూం, షాదీఖానా, ముస్లిం తాటిచెట్లపాలెం, రిజిస్ట్రార్ ఆఫీస్, కార్మిక శాఖ కార్యాలయం, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

'నేను ఆ గుంపులో లేను' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ జంగాలయ్య

సీతంపేట: యువ రచయిత హరి కుమార్ రచించిన 'ఐ యామ్ నాట్ ఇన్ దట్ ఫ్లాక్ (నేను ఆ గుంపులో లేను) పుస్తకావిష్కరణ విశాఖ పౌరగ్రంథాలయంలో జరిగింది. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ సభాధ్యక్షతన గురువారం జరిగిన సభలో విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ ఎస్. జంగాలయ్య ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరికుమార్ చిన్న వయసులోనే తన ఆలోచనలు, భావనలను పుస్తక రూపంలోకి తీసుకొచ్చి యువతరానికి స్ఫూర్తినిచ్చాడన్నారు. యువ రచయిత అయినప్పటికీ తన రచనా శైలి, పద ప్రయోగం చక్కగా ఆకట్టుకుంటోందన్నారు. భవిష్యత్‌లో మంచి కవిగా రాణించాలని ఆకాంక్షించారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో యువ రచయితల ప్రవేశం, కొత్త భావావిష్కరణల అవసరం ఎంతైనా ఉందన్నారు. రచయిత డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేస్తూ హరికుమార్ తన రచనలో కొత్త ఆలోచనను చొప్పించారని కొనియాడారు. తన అధ్యయనంతో భవిష్యత్‌లో మంచి రచనలు చేసే అవకాశం ఉందన్నారు. రచయిత్రి ఉమా గాంధీ, సీఐటీయూ నాయకురాలు పి.మణి పాల్గొన్నారు.

పార్టీ విజయంలో కీలకపాత్ర పోషిద్దాం

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్


యువజన విభాగ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఆళ్ల శివగణేష్

తాటిచెట్లపాలెం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి యువజన విభాగం కీలక పాత్ర పోషించాలని పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని జిల్లా యువజన విభాగం కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. జిల్లా, వార్డు, మండల స్థాయి కమిటీల నియామకాలను ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో సమన్వయం చేసుకుంటూ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జీలకర్ర నాగేంద్ర, బంగి హరికిరణ్ రెడ్డి, కొసిరెడ్డి గణేష్, ముప్పల సంతోష్, ఇల్లపు వెంకటరరావు, తాడి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

చందన అలంకరణలో శ్రీనివాసుడు



అల్లిపురం: తొలి ఏకాదశి పర్వదినాన బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయంలో స్వామి చందన అలంకరణలో నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. స్వామిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచే భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామిని చందనంతో విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

మహారాణిపేట: రోగులకు చిత్తశుద్ధితో సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి. జగదీశ్వరరావు సూచించారు. పెందుర్తి మండల పరిధిలోని సరిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్, కుటుంబ డాక్టర్ విధానాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీ వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. ఏఎన్ఎం,ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు.